


సంతబాబురావు చాలా మంచివాడని, ఉత్తమోత్తముడని ఆ గ్రామంలో పేరుంది. ఆ వూరి ప్రజలకి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాడు. ఏ అశుభకార్యాలైనా విధిగా హాజరై సానుభూతి వ్యక్తపరుస్తాడు. సహాకరిస్తాడు. యథాశక్తి సేవ చేస్తాడు అయితే శుభకార్యాలకి వెళ్ళడా అంటే- వెళ్ళకేం? వెళతాడు! కాని, అదేం గొప్ప? శుభకార్యం అనే సరికల్లా రంగురంగుల అందమైన పసందైన దుస్తులు ధరించి, స్నోలు, పౌడర్లు అద్దుకుని, సెంట్లు రాసుకుని, ఆడామగా అంతా ఆడంబరంగా బయలుదేరుతారు. అదే- ఎవరైనా గ్రామంలో చనిపోతే- "నే రాలేను తల్లీ! పిల్లాడు జడుసుకుంటాడు" అని తప్పుకుంటుందో ఇల్లాలు. "నా కసలే జ్వరం, వణికి పోతున్నాను. నాలుగు దుప్పట్లు కప్పినా చలి ఆగడంలేదు. బాబ్బాబు! నే రాలేను, నన్నొదిలేయ్" అంటాడో పెద్దమనిషి, పరామర్శకి వెళుతున్న మరో పెద్దమనిషితో.

కానీ సంతబాబురావు ఆ తరహా పెద్దమనిషి కాదు. గ్రామంలో ఎవరైనా చనిపోయినప్పుడు హాజరై, శవ వాహకుల్లో ఒకరై దహన సంస్కారం పూర్తయే వరకూ శ్మశాన వాటికలో వుంటాడు. గ్రామంలో ఎవరైనా రోగగ్రస్తులైతే రెండెడ్లబండి పూన్చి, ఆ రోగిని దగ్గర్లోవున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్ళి చికిత్స చేయిస్తాడు.

ప్రజల సేవలో ముప్పయ్యేళ్ళు

గడిపిన ప్రజాబంధువు పంచబాణరావు ఒకనాడు గుండెపోటువల్ల హఠాన్మరణానికి గురయ్యాడని తెలిస్తే, ఆ గ్రామ ప్రజల గుండెలు ఆగిపోవూ! దీనబంధువు కాలంచేస్తే తాము దీనులుగా మిగిలిపోరూ! దిక్కుమాలిన వాళ్ళం అయిపోయామే అనే దిగులు వాళ్ళలో ఆవహించింది.

చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోప తండాలుగా పంచబాణరావు అంతిమయాత్రలో పాల్గొనాలని వచ్చారు.

ఎన్ని గృహదహనాలు, మానభంగాలు చేసినవాడు చనిపోయినా "చచ్చాడు వెధవ! పీడి పీడ విరగడైంది!" అనే స్వభావం కాదు మనది. "అయ్యో పాపం!" అనే తత్త్వమే.

"అనాడు గజేంద్రుడు కుయ్యోమొర్రో అంటే మహావిష్ణువు రక్షించాడే! అటువంటి పంచబాణరావు ఇక లేడు!" విలపించాడు ఒక విద్యావంతుడైన ప్రముఖ వ్యక్తి, పోతన్న.

"పురుషులందు పుణ్య పురుషులు వేరయా అన్నట్టు ఆయన నిజంగా పుణ్య పురుషుడే" అన్నాడింకో వ్యక్తి వేమన్న.

"అదొక్కటేనా! అనాడు ద్రౌపదిని నిండు రాజసభలో అవమానించినప్పుడు ఆదుకున్న ఆపద్బాంధవుడు కృష్ణుని వంటి వాడు పంచబాణరావు!" అని దుఃఖాక్రాంతుడయ్యాడు ఒక వ్యాసన్న.

ఇక, విద్యాగంధం లేని కూలీనాలీ చేసుకునే శ్రమజీవుల వంతు వచ్చింది.

"బాబు కానా మంచోడు. దరమాతుముడు!"

"దరమ ప్రెబువు!"

"ఊరికినే ఎవ్వరూ కూకోనేడు. పెజలకి సేవచేస్తానే ఉండోడు!"

ఇలా ఎవరికి తోచిన ఉపశమన వాక్యాలు వాళ్ళు వల్లె వేస్తున్నారు.

కాని ఆ జనంలో అప్పాయమ్మ అనే నిండు యువతి నోరు మెదపలేదు.

"ఏదో కటనవే! నలుగుర్లో నావుండదూ!" అని పక్కానిద ముసలితో పొడిచింది. "ఏటనడం నాకేటి తెల్దూ!" అంది అప్పాయమ్మ. "తెల్దంటే ఎలాగే ఎర్రిమొగమా! అలా నోరుమూసుకుంటే ఆయన నవ్వడం నీ కిట్టనమ కుంటారు"

ఇహ గత్యంతరంలేక అప్పాయమ్మ అంది.

"సచ్చిపోయిన అయ్య కానా మంచోడు. 'అప్పాయమ్మా! నాకు పుంజీడు పిల్లలు పుట్టినోరుగాని సంసార సుకం నేదే! నీమీద మనసయ్యింది. నువ్వు కాదంటే నేను ఏ నుయ్యోగొయ్యో మూసుకోవలసిందే' అనంటే నేనన్నాను కదా- 'అయ్యా! నేను పేద యెదవరాల్ని. నాగ్గాని కడుపో, కాలో వొచ్చినాదంటే నా బతుకేం గావాల!' అనగా అయ్య ఏమన్నాడంటే 'అయ్యో అప్పాయమ్మా! నువ్వెంత అమాయకురాలివే! ఈ రోజుల్లో ఎన్నో మాదిమందు లొచ్చేసినాయి. ఒక్క ఇంజెక్సనిస్తే నీకేటీ అవదు' అని దయిరియం చెప్పి, నాకే సెమూదమూ రాకుండా, నలుగురిలోను నా పరువు కాపాడినాడు నేకపోతే నా బతుకేం గావాల!" అని కంటతడిపెట్టింది అమాయకంగా •